సాయంత్రం ఆరుగంటలప్పుడు గుంటూరులో రైలు దిగాడు సీతాపతి. తన పాతికేళ్ల జీవితంలో—అంతకుముందు ఒక్కసారి చూచిన ఆ ఊళ్లో — కొత్తదనం ఫీలవుతూ స్టేషన్ బయటకు నడిచాడు.

పరిసరాలు — పేవుమెంట్లు, రోడ్లు, యిళ్లు—సర్వం—తనలో ఆవరించిన కొత్తదనంలా — రైలు పొగతో వెలువడిన బొగ్గు రేణువులతో కప్పబడి వికృతంగా వున్నయి.

అడుగులు ముందుకు వేశాడు—తనకు తెలియని రాజశేఖరంగారి చిరునామా కళ్ల ముందు కదలగా!

దగ్గరా?—దూరమా?

ఏమో?...ఎవర్నయినా అడగాలి!

ఊహూఁ...అయినా—దగ్గరయినా తను నడుస్తాడా?—నడవగూడదు!

హుందాగా వుండాలి!

అయితే గియితే— తమ వారికి కాబోయే అల్లుడు!

—పెదాలమీద నవ్వు సిగ్గుపడుతున్నట్లు తొంగి చూచింది.

ఆగి ఠీవిగా పక్కకు చూస్తూ, ఏయ్ రిక్షా!' అని పిలిచాడు. 'బ్రాడీపేట... నాలుగోలైను...చివరకు...' ఏమనుకున్నాడో ఏమో—రిక్షావాడి సమాధానం గూడా వినకుండనే ఎక్కికూర్చోబోయాడు.

భుజంమీద చేయిపడింది.

ఆశ్చర్యపోతూ వెనక్కు తిరిగాడు.

తెలిసిన మొఖంలాంటి మొఖం!

కాస్త కళ్లు చికిలించి చూచాడు—విచిత్రంగా మొఖం పెట్టాడు.

'గుర్తు పట్టలేదా సీతాపతీ!' అతడు నవ్వాడు—అతడి గొగ్గిపన్ను అతడిని గుర్తు చేసింది.

సీతాపతి హుషారుగా నవ్వాడు.

'చలపతీ! నువ్వా!' అన్నాడు. 'ఈ ఊళ్లో వుంటున్నారా మీరు?'

'అవును!' ఏడెనిమిది సంవత్సరాలనాటి స్నేహం కళ్లముందు కదలగా అన్నాడు.

ఆ కొత్తవూళ్లో ఏదో తేలిక దనం ఫీలవ్వసాగాడు—చలపతిని చూడగానే!

'ఇదేనా రావటం? ... ఏమిటి పని?' ఆసక్తితో ప్రశ్నించాడు.

'ప్చ్!...ఏదో చిన్నపని!' మనిషిని సిగ్గు ఆవరించింది, జస్ట్...ఇంటర్వ్యూ! 'నుదురు

విగరవేసి బిగ్గరగా నవ్వాడు.

చలపతి అర్థం చేసుకొని, ఫక్కున నవ్వి సీతాపతి బుజాన్నితట్టాడు 'అచ్ఛా!'

సీతాపతిని ఇంకా సిగ్గు వీడ లేదు.

రిక్షావాడు, 'ఎక్కడండి బాబూ!' అంటు న్నాడు.

చలపతి అతడి మాట వింటూనే, 'అయితే నీవు ఇప్పుడు వాళ్ళింటికే వెళు తున్నావా?' అడిగాడు.

'అవును!'

'వాళ్ళు నీకు తెలుసా?'

'లేదు పరిచయం చేసుకోవాలి!'

'అయితే ఒక పనిచేయి . మా యింటికి వెళ్దాం పద...రేపుదయం అక్కడికి వెళ్ల వచ్చు!'

అది బాగానే వుంటుందని–'సరే! పద .. రిక్షాలో వెళ్దామా?' అన్నాడు.

'ఎందుకూ–నడిచివెళ్దాం.. దగ్గరే!'

చిన్ననాటి మిత్రులిద్దరూ నడక సాగించారు.

'ఒక్కడివే వచ్చావేం . అమ్మా నాన్నను తీసుకురాకపోయినావా?'

'వాళ్ళు 'వచ్చి చూసివెళ్లే . . హైద్రా బాదుకు నాకు ఉత్తరం వ్రాశారు!' నవ్వాడు సీతాపతి సిగ్గుతో.

కుడిచేతి వైపుకు తిరిగి–మురుక్కాలవ వక్కగా వున్న సన్నటి సిమెంటుదారి మీదుగా, అడుక్కునే వాళ్ళమీదగా అడు గులు వేసుకుంటూ ఓవర్ బ్రిడ్జి మెట్లెక్కారు ఇద్దరూ.

బ్రిడ్జి ఎక్కింతరువాత–సీతాపతి నలు వైపులా దృష్టి సారించి, 'గుంటూరు చాలా మారిపోయింది!' అన్నాడు.

చలపతి నవ్వాడు.

చలపతి అలా నవ్వుతుంటే — సీతాపతి కళ్ళముందు–చలపతి చెల్లెలు–అలాగేనవ్వే శారద–నిలబడింది.

శారద!

ఇప్పు డెలావున్నదో?

వివాహమయిందా?

ఏమో?

మనిషిలో ఆ కుటుంబంమీద– సీతాపతి మీద–తన చిన్ననాటి మిత్రురాలు శారద ద్వారా–ఉత్సుకత పెరిగింది!

శారద!...శారద!...

మనసు

తనతో ఎల్లప్పుడూ తిరిగిన శారద ..

—మనిషి విలాసంగా నవ్వుకున్నాడు

'శారదకు వివాహమయిందా? శారద ఎక్కడ వున్నది?' — అడగబోయాడు గాని సిగ్గు ఆవరించింది.

'అయితే సీతాపతీ! నీవు ఇప్పుడేం చేస్తు న్నావ్?'

'బి యి. అయింది. హైద్రాబాద్‌లో ఓ ప్రైవేట్ ఫరంలో పని చేస్తున్నాను!' చిన్నగా నవ్వాడు

'నేను లా పూర్తిచేశాను .. ప్రస్తుతం జూనియర్‌గా వున్నాను!' చలపతీ నవ్వాడు

ఇద్దరూ బ్రిడ్జి దిగారు.

'కాఫీ త్రాగి వెళ్దామా?

'నీ యిష్టం!'

ఇద్దరూ హోటల్‌నుండి బయటకువచ్చి తిరిగి నడక సాగించారు.

తిరిగి సీతాపతి మనస్సును— చిన్నప్పటి అందమైన శారద మొఖం--ఆవరించింది. మనిషిని గిలిగింతలు పెట్టింది!

ఇప్పు డెలా వుంటుంది?

—మొట్టమొదటిసారిగా గడపలో కాలు పెడుతుండగా కనబడింది చలపతి తండ్రి గారు రెండు చేతులూ జోడించి, 'నమ స్కారమండీ!' అన్నాడు సీతాపతి.

ఆయన తొందరగా గుర్తుపట్టలేక పోయారు. జ్ఞాపకాలు తడుముకో సాగారు.

'నేను రామనాథంగా రబ్బాయిని.. సీతా పతినండీ!'

'ఓహోహో...నువ్వటోయ్...!'

* * *

కాళ్ళు కడుక్కోవటానికి నీళ్లిస్తూ



శారదాంబగారు అడిగింది. 'అమ్మా, నాన్న, తమ్ముడూ, చెల్లెలూ బాగు న్నారా?' అని.

శారద వచ్చి కాళ్లకు నీళ్లిస్తుందేమో నని ఆశపడ్డ సీతాపతి మొఖాన్ని కాస్తంత నిరాశ ఆవరించింది. కప్పిపుచ్చుకుంటూ, 'ఆఁ..ఆఁ...' అన్నాడు.

చలపతి తువ్వాల అందించాడు తుడుచు కుంటూ కుర్చీలో కూర్చున్నాడు సీతాపతి.

ఇప్పుడు శారద కాఫీ తెస్తుందేమోననే ఆశమనస్సుకు ఊరట కలిగించింది.

కాని కాఫీ గూడా శారదాంబ గారే స్వయాన తెచ్చియిచ్చింది.

కాఫీ త్రాగుతుంటే అనిపించింది—ఒక వేళ శారదకు వివాహమయి అత్తవారింటికి వెళ్లిందేమోనని!

ఏమో?—

కాని – ఇంతలోనే ఆ ఆలోచనలనువమ్ము చేస్తూ ఓ ఆకారం — ఊహల్లో మెదిల తున్న శారదలాంటి ఆకారం — ఆ పక్క గదిలో లీలగా మెదిలినట్లనిపించింది. ఓ పట్టుపావడ చివరి జరీ అంచు క్షణం అతడి కళ్లముందు తళుక్కున మెరిసి మాయమయింది!

అవును!

—శారద సిగ్గుతో తన ముందుకు రాలేకపోతుంది—అనుకున్నాడు!

ఆ ఆలోచనే అతడి మనస్సుకు తృప్తి నిచ్చింది.

చిన్నగా పెదాలమీద చిరునవ్వు మెరి సింది.

తరువాత ఓ అరగంటకు— 'అలా తిరి గొస్తాం'—అంటూ యిద్దరూ బయట పడ్డారు.

చలపతి ఎంత కలుపుగోలుతనంగా మాట్లాడుతున్నా–'శారద విషయం' అను కునే టప్పటికల్లా—మనస్సును తెలియని 'కొత్తదనం—భయం' ఆవరిస్తున్నాయి!

—తనని ఏమైనా అపార్థం చేసు కుంటాడేమోననే భావన అతడి నరనరాన్ని ఆవరించింది.

చిన్నప్పటి సంగతి వేరు—

ఎంతో చనువుగా వుండేవాళ్ళు ఊహ తెలిసీతెలియని చిన్న పిల్లలు గాబట్టి— కాని, ఈనాడు యుక్త వయస్సులో—

[illegible]

అయినా.. ఊహూం... వివాహం అయి వుండకపోవచ్చు...

నిజంగా వివాహం అంటూ జరిగి వుండకపోతే-శారదను తప్ప మరెవర్నీ తను వివాహం చేసుకోడు!

ఇన్నాళ్ళా ఎలా మార్చిపోయి వుండగలిగాడు అంటే-అది వేరే విషయం!

ఒకవేళ వివాహమే అయివుంటే—

అదో వికారపుభావన — అతడు ఉక్కిరి బిక్కిరి అయ్యాడు.

అలాగే జరిగివుంటే — నిజంగా తనను మించిన దురదృష్టవంతుడు వుండడు!

—అలాంటి ఆలోచనలతో అతడు సతమతమయ్యాడేగాని, తన మనస్సులోని అనుమానాన్ని చలపతిద్వారా తీర్చుకోలేక పోయాడు!

మొట్టమొదటిసారిగా — తనలో ఏదో బలహీనత ఉన్నదన్నట్లుగా—ఆరోజే తెలుసుకోగలిగాడు!

ఆ రాత్రి భోజనాలయినతరువాత ఆరుబయట వెన్నెల్లో వేసివున్న పక్కలమీదకు జేరుకొన్నారిద్దరూ.

దూరంగా శారదాంబగారు తలుపు ప్రక్కగా కూర్చున్నారు.

చలపతి తండ్రి భోజనంచేసి బయటకు వెళ్ళాడు — ఎవరింటికో!

మనసు

చిట్టచివరకు ఎలాగయితేనేం మనస్సును కూడదీసుకొని మనస్సులోని అసలు విషయం బయటపెట్టాడు.

—అందునా, ఒకటి రెండుసార్లు, వాళ్ళు భోజనం చేస్తున్న సమయంలో — ఏదో నీడ—శారదదే అనిపించేలా అటూ యిటు కదిలింది!

అయినా, అంతా లోపల వుండగా—ఇంత శుభ్రంగా ఆరుబయట పక్కలు ఎవరు వేయగలుగుతారు? — అందమైన శారదకు మించి!

అనవసరంగా ఒక్కసారి పెద్దగా నవ్వి, 'అయితే చలపతీ! మీ చెల్లెలు ఎక్కడా కనబడటంలేదు—పెళ్లిచేసి అత్తవారింటికి గాని పంపేశావేమిటి?' అన్నాడు — అలా జరగకుండా వుండివుండాలని వేయిదేవుళ్లకు మనస్సులోనే మొక్కుకుంటూ!

అలా అన్నతరువాత ఒక్కసారిగా నెత్తిన మోస్తున్న బరువు నైతొలగిపోయినట్లని పించింది. శరీరమంతా తేలికయి హాయిగా ఉన్నట్లనిపించింది. మనిషి గాలిలో తేలిపోతూ ఏదో ఆహ్లాదాన్ని పొందసాగాడు—ఎంతో హాయిగా వుందనిపించింది—ఒక్క క్షణం!

ఆత్రంగా తలెత్తి చలపతి మొఖంలోకి చూశాడు — మెరుక్షణంలోనే!

పక్కకు తిప్పుకొనివున్న అతడి మొఖం మీద ప్రకీనీడ పడుతుంది.

'చాలా చిలిపిగా వుండేది చిన్నప్పుడు—ఇంకా ఇప్పుడూ గోల చేస్తూనేవున్నదా?' మరోసారి తెచ్చిపెట్టుకున్న నవ్వుతో పరిపరాలు వింపాడు.

పక్కన తలుపు కొద్దిగా కదిలిన చప్పుడయింది.

చలపతి పెదాలు కదిలి ఏదో మాటలు వెలువడేలోగానే, 'నేనూ చూచి చాలా రోజులయింది...' అన్నాడు. కళ్లను తను తెచ్చుకున్న ధైర్యానికి కాంతితో నింపుకుంటూ.

'అవును...' చలపతి గొంతు పెగల్చుకొని అన్నాడు. 'అలా అనుకోకుండా అయిపోయింది...ట్పైంగూడా లేదు.. మీ కందరికీ తెలియబరుద్దామనుకున్నాంగాని లాభం లేకపోయింది...ఆ అబ్బాయి ఎక్కడికో ఏదో ట్రైనింగ్‌కు వెళ్ళాలని త్వరపడటంతో..'

సీతాపతికి భూమి జరిగిపోతున్నట్లనిపించింది.

బిక్కమొఖం వేసుకొని ఏదో తప్పు చేసినవాడిలా స్నేహితుడి మొఖంలోకి చూస్తూ వుండిపోయాడు.

'వివాహమయిందా?' ఆత్రంగా అడిగాడు.

'అయింది!' ఒక్కక్షణ మాగాడు. 'అయింది సీతాపతి!.. మేమంతా కలసి దాని మెడకు ఓ ఉరిత్రాడు బిగించాం... దాని విముక్తి లేదు!' చలపతి తల వాలిపోయింది.

'ఏమైంది?' ముందుకు వంగాడు. త్వరత్వరగా 'ఏమైంది చలపతీ!' అన్నాడు.

'...ట్రైనింగ్‌కంటూ వెళ్లిన అతడు తిరిగి రానేలేదు. ఏదో ప్రమాదంలో...' అతడి కళ్ళు తడిసి మరింత బరువెక్కినయి.

సీతాపతి విచలితుడయ్యాడు.

మనిషిని నీరసం ఆవరించింది. నోరు ఎండిపోగా మాట వెలువడలేదు. బిగుసుకుపోయి గిల గిలలాడసాగాడు.

అతడు సర్వం మరిచిపోయాడు.

అతడికి తరువాత — ఆ మగతలో—ఎప్పుడు నిద్రపట్టిందో గూడా తెలియదు!

అందంగా గీసుకుంటున్న చిత్రాన్ని



పేపర్ ముక్కలు ముక్కలుచేసి గురిసెల మీద వెదజల్లారు!

* * *

తూర్పు తెలతెలవారుతుండగా సీతాపతికి మెళుకువ వచ్చింది.

తలెత్తి పక్కకు చూస్తే చలపతిపక్క ఖాళీగా కనబడింది.

లేచి లోపలికి నడిచాడు సీతాపతి.

గడప దాటుతుండగా కాళ్ళు వాటంతటవే ఆగిపోయినయ్.

లోపలనుండి శారదాంబగారి కంఠం వినబడుతుంది. 'అదిగాదురా చలపతీ!... సీతాపతిని అడగరాదూ!...అతడికీ చిన్నప్పటి బట్టీ శారదంటే యిష్టమే... చాలా చనువుగానూ, ఆత్మీయంగానూ వుండేవారు. .ఏంబోయింది...సీతాపతికి విజంచెప్పి .. అయినా ఆ పెళ్ళిలో ఏం చూసిందో ఆ మొగుణ్ణి...పెళ్ళితంతు ఒక్కటేగదా జరిగింది...సీతాపతీ అభ్యంతరం చెప్పకపోవచ్చు.. అతడిగుణం మనకూ తెలుసుగదా!...కదిలించి చూడు!...దాని అదృష్టం బాగుంటే అతడు అంగీకరించవచ్చు!'

చలపతి ఏదో గొణుగుతున్నట్టుగా నసుగుతున్నాడు.

సీతాపతి ఉలిక్కిపడ్డాడు.

శారదకు తిరిగి వివాహం చేయాలను కుంటున్నారా?—అందునా తనకిచ్చి!

ఉలిక్కిపడ్డాడు సీతాపతి.

అదెలా సంభవం?—ఆచార వ్యవహారాలకు పుట్టినిల్లయిన తన కుటుంబంలోనికా ఆ విధవపిల్లను పంపుదామనుకుంటున్నది?—తనవాళ్ళ సంగతి తెలియకనే అలా అనుకుంటున్నదా శారదాంబగారు?

ఇబ్బందిగా అటూ యిటూ కదిలాడు సీతాపతి.

తన తల్లిదండ్రులకు ఈ విషయం తెలిస్తే?—

ఏంవో ..

ఉహూం...

తనకుమటుకూ—

మనిషి తడబడ్డాడు.

ఒకసారి వివాహమయి భర్తృవిహీన అయిన ఆ అమ్మాయిని తనుమాత్రం ఎలా వివాహం చేసుకోగలడు?

—చూస్తూ చూస్తూ విధవను!

(లోకం దృష్టిలో—తను ఎంత హీన

ఋతుక్రమం ఆలస్యమైతే?

విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన దేవిపిల్సు వాడండి



పూర్తికోర్సుప్యాకెట్టు 28 మాత్రలువెల రు॥
సగంకోర్సుప్యాకెట్టు 14మాత్రలువెల రు.
పోస్టేజి అదనము
ప్రతిచోటదొరకును

దేవిపిల్సు ముఖ్యంగా ఆలస్యమైన క్రమముగాకాక పోయిన,బాధతోకూడిన,లేక ఆగిపోయినబహిష్టకుదేవిపిల్సు బాగుగ గుణమిచ్చును

1 అన్ని సందర్భములలోను శీఘ్రముగాను, అమోఘముగాను పనిచేయును
2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఏహాని కలిగింపదు

MFRS SEENU & CO., MADRAS-21

ప్రఖ్యాత కెమిస్టులు మరియు డ్రగ్గిస్టులందరి వద్ద లభించును.

Advt. Permitted under G O. MS. No. 1121

ఐటెక్స్

అలంకరణ సాధనములు

ఐటెక్స్ కాటుక

ఐటెక్స్ కుంకుమ చాందు

ఐటెక్స్ కుంకుమ పేస్ట్

ARAVIND LABORATORIES P. B. 1415, MADRAS—17.

ఏజెంట్లు కావలెను

రు. 255 ఖరీదుగల 3 బ్యాండ్, ఆల్‌వరల్డ్ పోర్టబుల్ ESKO ట్రాన్సిస్టర్‌లకు సెట్ ఒకటికి రు 85 కమిషను మీద ఏజెంట్లు కావలెను. శాంపిల్ ట్రాన్సిస్టరు వాయిదా చెల్లింపు పద్ధతిన తేలికగా పొందవచ్చును. వివరములకై ఇంగ్లీషులో వ్రాయండి



Mulk Raj Loomba (H-131)
Urdu Bazar, Delhi-6

టెరిలిన్ వస్త్రములు

టెరిలిన్ ప్యాంటు మరియు షర్టు వస్త్రములు (1.25 & 2.25 మీ.) రెండున్ను క్లియరెన్సు ధర రు 28.50 లకే అమ్మబడును V.P.P ఛార్జీలు రు 2.50 అదనం

ARVIND AGENCIES (APW-40)
P. O Box 1408, Delhi-6

ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో మహిళలు

ఆరోగ్య సౌభాగ్యములకు ఆధారపడునది లోధ్ర

66 సంవత్సరముల పైగా ప్రసిద్ధినొందినది

కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట మద్రాసు-14

ఏజెంట్లు
సీతారామ జనరల్ స్టోర్సు (ఏజన్సీస్)
విజయవాడ సికింద్రాబాదు మదురై బరహంపురం బెంగుళూరు

దృష్టితో చూడబడతాడు?

లేదు ..

తల అడ్డంగా ఊగింది.

వాళ్ళకా అవకాశమే యివ్వగూడదు!

'కొన్ని గంటల క్రితంవరకు నీ పరనరాన్ని శారదను వివాహం చేసుకోవలనే కోరికే ఆవరించి వున్నదే సీతాపతీ!'—మనస్సు వెక్కిరించినట్టనిపించింది

అదివేరు—శారదకే గనుక వివాహం కాకుండా వున్నట్టయితే, ఎన్ని అడ్డంకులున్నా ఎదుర్కొని, ఆమెనే భార్యగా పొంది వుండేవాడు—

కాని—

ఈ క్షణంలో ఆ పరిస్థితులు వేరు—

తను వాటికి తల ఒగ్గలేడు.

తిరిగి చలపతి గొంతు వినబడింది.

'నాకయితే మనస్సంగీకరించటంలేదు గాని—నీ మనస్సు నొప్పించటం ఇష్టంలేక ఈ ప్రయత్నం చేస్తానమ్మా!. .ఇందులో మనం కొన్ని ఆలోచించాల్సిన విషయాలున్నాయి .. శారదకు, సీతాపతికి ఒకళ్ళంటే ఒకళ్ళకు అభిమానం జాస్తి అన్నావ్ .కాని ఆ సత్యాన్ని నీవు చాలా ఆలస్యంగా గ్రహించావ్! అదే నీవు ముందుగా తెలుసుకొని వున్నట్లయితే అసలు శారద జీవితమే ఇలా వుండేదిగాదేమో ఇక, అంతేగాదు . ఈ విషయాన్ని మనం చాలా తేలిగ్గా తీసుకోవాలి .అతను కాదన్నా బాధపడకూడదు . ఎందుకంటే తొంభై తొమ్మిదిపాళ్ళు అతను కాదనటానికే ఆస్కారమున్నది!...'

శారదాంబగారి గొంతు విసుగ్గా వినబడింది: 'ముందు నీకిష్టంలేదని చెప్పరాదూ. లేకపోతే ఈ అనవసరపు వాదనంతా దేనికి?—అసలు నేనే అడుగుతానుండు ఆ బంగారపు మొఖం చూసి కాదనేటందుకు అతడికి నోరెలా వస్తుందో చూస్తాను—ఆమాత్రం నోరు తెరిచి అడిగే చనువు అతడిదగ్గర నాకున్నది!'

చలపతి విసురుగా బయటకు వస్తున్న చప్పుడయింది

సీతాపతి భయం భయంగా పక్కగదిలోకి తప్పుకున్నాడు.

ఆలోచనాతరంగాలలో కొట్టుకుపోతూ బిత్తర చూపులతో తలపైకెత్తాడు.

అక్కడో సాలెపురుగు అందంగా గూడు కడుతుంది—వలపన్నుతుంది!

ఆ దృశ్యానికి అతడిమొఖం మరింత కలవరపాటుతో నల్లబడిపోయింది!

తనచుట్టూ తనకు తెలియని విషవలయం అల్లుకుపోతున్నట్లనిపించింది—తను దాంట్లో చిక్కుకుపోయి, దారీ తెన్నూ తెలియక గిలగిల లాడిపోవల్సి వస్తుందా?

ఏమో?

శరీరాన్ని తత్తరపాటు ఆవరించగా చమటలు కక్కసాగాడు.

కుర్చీకి అతుక్కుపోయాడు.

ఆ క్షణంలో ఆ గృహం ఏదో భయంకర ప్రదేశమనిపించగా, దానిలోని వ్యక్తులంతా రాక్షసుల్లా కనిపించసాగారు.

ఆ ప్రదేశానికి, ఆ వ్యక్తులకి దూరంగా—వీలయినంత దూరంగా క్షణాలలో పారిపోవాలని ఆతృతపడసాగాడు సీతాపతి!

చలపతి ఆ గదిలో కాలుపెట్టాడు—సీతాపతి గొంతు నొక్కబోతున్నట్లుగా!

ఇప్పుడే అడిగేస్తాడా ?

—తనేం చెప్పాలి? తనెలా చెప్పాలి ?

అతి నిర్మొహమాటంగా 'లేదూ' అని చెప్పగలడా ?

ఉహూం. అంత నిక్కచ్చిగా ఎలా!

కాదంటే — కాస్త కూస్త అంగీకారం చూపించి — మిగతాది పెద్దవాళ్ళ మీదకు నెట్టివేస్తే—?

ఇప్పుడతను వచ్చిన పని నెరవేర్చుకోవటమూ కష్టమే !

ఇటు శారద మీద అనంగీకారం చూపినా—అటు వెళ్ళి ఆ పిల్లను చూడటమూ బాగుండదు!

ఏం చేయాలి ?

ఎటూ తెలియని అయోమయంలో పడిపోతున్నాడు సీతాపతి !

కళ్ళముందు అందంగా (భయంగా) అల్లుకుపోతున్న సాలెగూడు గిర్రున తిరుగుతుంది

'లే సీతాపతి!...పెందరాళే వాళ్ళింటికి వెళ్ళొద్దాం!' అన్నాడు చలపతి నవ్వి.

అతడి మాటలకు సీతాపతి కొంత తేలికపడ్డాడు—ఒక్క క్షణం !

కాని—ఒకవేళ దారిలో ఆ విషయం అడుగుతాడేమోననే భయం మరల పట్టు

కున్నది !

తరువాత అరగంటకు ఇద్దరూ రోడ్డు మీదకొచ్చారు.

'ఇంకా నీవు చిన్నప్పటిలాగవే వున్నావా సీతాపతీ!' అన్నాడు చలపతి రోడ్డుమీదకు వచ్చి రిక్షా ఎక్కిన తరువాత కళ్ళు చికిలించి చూస్తూ.

'అంటే ఎలా ?' తెచ్చిపెట్టుకున్న భయం నడుమ నవ్వాడు.

చలపతన్నా, చలపతి మాటలన్నా భయంగా వున్నాయి—తన చుట్టూ అతడు సాలెగూడు అల్లేస్తున్నాడు !

'అదే—నీ భావాలు, ఉద్దేశ్యాలు రివల్యూషనరీగా వున్నాయ్యా ?'

చలపతి ఉద్దేశ్యమేమిటో సీతాపతికి అవగాహన అయినట్లనిపించగా మరోసారి బుజాలు తడుముకున్నాడు.

—ఒకప్పుడు అల్లరి చిల్లరగా తిరిగి పెద్దల నిబంధనలమీద, వాళ్ళ ఆచార వ్యవహారాల మీద ధ్వజమెత్తిన మాట నిజమే !

కాని—ఈనాడు...

అందునా ఈ క్షణంలో—

సీతాపతి పేలవంగా నవ్వాడు. 'లేదు... లేదు .అవన్నీ పాత రోజులు !' తప్పుకున్నట్లుగా నసిగాడు.

సీతాపతి ఓ నిశ్చయాని కొచ్చాడు. 'ఆ పిల్లను చూచిన తరువాత (తన తల్లిదండ్రులు చూచి బాగావే వుంటుందని వ్రాశారు గనుక—తనకు అనుమానం లేదు ఆమె అందం మీద!) చలపతికి మరేఅవకాశం ఇవ్వకుండా—ఆ పిల్ల నచ్చిందని, వివాహం చేసుకోబోతున్నానని చెప్పివేయాలి !'

ఆలా గనుక తన నిశ్చయాన్ని వెలిబుచ్చినట్లయితే—ఇక వాళ్ళకు శారదను గురించి తనను అడిగే ఆస్కారమేలేదు !

మనిషిలో తిరిగి బలం పుంజుకుంది.

అతడు రామనాథంగారబ్బాయి — 'సీతాపతి' అని తెలియగానే వాళ్ళు పరమానంద భరితులయ్యారు.

వాళ్ళిద్దరిని ఎంతగానో మర్యాద చేశారు. మన్నన చేశారు. వాళ్ళు హడావుడి పడి ఇతరులను హడావుడి పెట్టారు

సీతాపతికి వాళ్ళ తొక్కిసలాట చూస్తే గర్వమేసింది. ఏదో అందల మెక్కినట్లుగా ఫీలయ్యాడు.

సర్వం మరచి — అప్పటివరకూ పడ్డ వేదననూ, బాధనూ మరచి—ఆ పిల్లను ఏదేకంగా చూచాడు.

బాగావే వున్నదనిపించింది !

ఆలాగే ఆ అమ్మాయిని—సిగ్గుతో ఎరుపెక్కి బరువుతో వంగిపోతున్న ఆ అమ్మాయి అందమైన తలకట్టుని చూస్తుంటే — కళ్ళముందు శారద నిలచింది !

ఏదో తెలియని రూపం — మొఖాన కుంకుమ లేకుండా — బోసిపోతూ కళ్ళ ముందు మెదిలింది !

కలవరపడ్డాడు.

—ఆ కలవరపాటునుండి తేరుకోకుండావే, ఆ గృహంనుండి బయటపడ్డ కొద్ది నిముషాలలోవే వడివడిగా, మాటలు తడబడుతూ, 'నాకు ఆ అమ్మాయి నచ్చింది చలపతీ ! అన్నాడు. 'ఇక ఈ మ్యాచ్ సెటిల్ అయినట్లే !' అతడు అడక్కముందే ముందుగా అనుకున్నట్లుగా అవేసి పెద్దగా నవ్వాడు

ఆలా అన్నతరువాత అతడిని ఎంతగానే శాంతి ఆవరించింది. పడ్డ వేదనంతా మర్చిపోయాడు. ఆవరించిన భయమంతా మటుమాయమయింది—తృప్తిగానూ, ధైర్యంగానూ శ్వాస పీల్చుకున్నాడు !

ఇంటికి వెళ్ళేటప్పటికి సరిగ్గా ఒంటిగంటయింది.

భోజనాలయినయి.

అసలు భోజనాల సమయంలో శారదాంబగారే ఆ విషయం ఎత్తారు — తిరిగి సీతాపతిని ఆలోచనావలయాలనడుమ చిక్కుముడివేసి.

'ఏమయ్యాః సీతాపతి ! పిల్ల ఎట్లా వున్నది?' ఆమె నవ్వుతూ అడిగింది. ఆ నవ్వు వెనుక ఆమె కంఠంలో విషాద మున్నట్లనిపించింది సీతాపతికి !

ఆమె ప్రశ్నకు కొద్దిగా సిగ్గుపడ్డా! తలెత్తకుండావే, 'బాగావేవున్నది !' అన్నాడు అతడూ నవ్వి.

'శారదకంటే గూడానా?'

చటుక్కున తలెత్తాడు సీతాపతి.

ఆమె ఎటో చూస్తోంది.

చలపతి ఇబ్బందిగా, వినుగ్గా అటూ యిటూ కదిలాడు.

సీతాపతి గుండె దడదడ లాడింది

భయంభయంగా తల వంచుకున్నాడు.

'ఏమయ్యా ! మాట్లాడవేం !' గంభీరపు రెట్టింపు.

ఏలా సమాధానం చెప్పాలో అర్థం కాలేదు సీతాపతికి.

తికమక పడ్డాడు.

నోట్లో పెట్టుకున్న ముద్ద పొరబోయింది

గడగడా ఓ గ్లాసెడు మంచినీళ్ళు తాగాడు.

ఇంకా తన సమాధానానికి ఆత్రంగా చూస్తున్న ఆమె మొఖాన్ని ఓ క్షణం పరిశీలనగా చూచి, నత్తినత్తిగా 'నేను శారదను ఈ మధ్య చూడలేదు !' అన్నాడు,

పక్కకు తిప్పుకున్న ఆమె మొఖంనుండి



దీర్ఘనిశ్వాసం వెలువడింది.

'తరువాత ఆమె మళ్లీ మాట్లాడలేదు.

అతడు ముళ్లమీద కూర్చొని భోజనం చేసినట్లుగా చేశాడు.

చేయి కడుక్కొని తన గదిలోకి వెళ్లబోతూ, 'ఇంకో గంటలో బెజవాడకు ట్రెయిన్ వుంది—వెళతానండి. అక్కడో మిత్రుణ్ణి కలవాలి ... మళ్లీ రాత్రికే హైద్రాబాదుకు వెళ్లాలి!' అన్నాడు శారదాంబగారి వంక చూస్తూ. దొంగతనం చేసిన వ్యక్తి గోడ ఎప్పుడు దూకి బయట పడదామా అన్నంత ఆత్రంగా వున్నది ఆతడి ప్రవృత్తి!

'వారు ఇప్పుడే వస్తానన్నారు ... నీతో ఏదో మాట్లాడాలట!' అని 'వెళుదువు గాని లేవోయ్! రాక రాక వచ్చావ్ ఏమిటీ తొందర!' నవ్వింది ఆమె.

ఆమె నవ్వుకు అతడు కలవరపడ్డాడు.

ఏం సమాధానం చెప్పాలో తోచలేదు.

'కాదు ... నేను వెళ్లిపోవాలి!' అని మొండిగా ఎలా చెప్పగలడు—ఏం మర్యాద అది!

తన బలహీనతది!

ఆయన ఏం మాట్లాడతాడు తనకు తెలుసు — శారదను వివాహం చేసుకోమంటాడు!

అంతేగాకుండా — జాలి గుండెగల తన ముందు—కన్నీళ్లు పెట్టుకోవచ్చు చేతులు పట్టుకు బ్రతిమలాడవచ్చు — కాదంటే కాళ్లు పట్టుకుంటే మాత్రం ఎవరు ఆపగలరు?

కాని—వాళ్లు ఆలోచించరు — తనని, తల్లిని, తండ్రిని, వంశాన్ని, లోకాన్ని — గురించి!

కాసేపు విసుగు. కాసేపు కోపం, కాసేపు భయం— మనిషి నలిగిపోతున్నాడు!

మొఖమంతా నల్లబడిపోయింది.

చెమటలు కక్కుతున్నాడు.

బాధగా, భయంగా తలెత్తితే పైగా, మూలగా సాలెగూడు...

కనురెప్పలు బరువుగా వాలిపోసాగినయి...

గదిబయట అడుగుల సవ్వడి.

చలపతి తండ్రా?

అటు యిటూ కదిలి బిగుసుకు కూర్చున్నాడు.

చెప్పేయాలి—'మీ అమ్మాయిని చేసుకోను!'—అని!

పెదాలు బిగించాడు.

అడుగులు మరింత దగ్గరయినయి.

చిన్న దగ్గు!

గుండె దడదడ లాడుతుండగా, భయం భయంగా కనురెప్పలెత్తి తలుపు వంక చూచాడు.

శారద!

అతడి కళ్లు వాలిపోలేదు తెరచుకున్న నోరు మూతపడలేదు. అతడి చూపు మరలలేదు!

జరీ అంచు ఎర్రని పట్టుపావడామీద గులాబీరంగువల్లె — ఎర్రని శారదను — వత్తయిన కురులతో అందంగా మెరిసిపోతున్న ఆమెను — దేవతలా మారుస్తున్నయి!

ఆమె విద్యుల్లతలా మెరిసిపోతుంది!

అతడి చూపుకు తత్తర పడుతున్నట్టుగా, 'నేను శారదను!' అన్నది చిన్నగా నవ్వి.

అతడికి నోటివెంట మాట పెగల్లేదు —కళ్లు రెపరెప లాడించాడు.

'నే నో విషయం చెబుదామని వచ్చాను!'

'చెప్పు!' అన్నాడు—ఎలాగో పెగల్చుకొని —తడారిపోయిన గొంతుకతో!

'మా వాళ్లు ముఖ్యంగా మా అమ్మ—ఏవేవో ఆలోచిస్తోంది — ఎన్నో పన్నాగాలు పన్నుతుంది—ఆమెది చెడు ఉద్దేశ్యం కాక పోవచ్చు! ఆమెకు నా సుఖమే ముఖ్యమవ్వచ్చు...కాని, నాకూ మనస్సు వున్నది. నాకూ హృదయమున్నది నాకూ నాకు తగ్గ ఆలోచనలు వున్నయి. నాకూ జీవితం మీద, నా ఆశయాలమీద ఓ నమ్మకమున్నది, కోరిక వున్నది.. నేను పెద్దవాళ్ల కోరికలకు, వాళ్ల ఆటలకు బలి కాదలుచుకోలేదు — నా మనస్సుకు ఏది తృప్తి కలిగిస్తుందో, ఏది మంచిదనిపిస్తుందో అదే చేయగల ధైర్యం శక్తి— దురదృష్టవంతురాలినయిన — నాకు వున్నయి. గుండె ధైర్యమున్నది నాకు. పిరికిదాన్ని గాదు నేను—అందుకే అందరి దృష్టిలో నేను 'మొండిదాన్ని'!' ఆమె చిన్నగా నవ్వింది



సీతాపతికి ఆమె మాటల ధోరణి అర్థం గాకపోగా—తనను ఎత్తిపొడుస్తున్న ద్వేషం ననిపించి కుంచించుకు పోసాగాడు

'అందుకే— మీ దృష్టిలో తేలికయినా సరే— మీ ముందు నిలబడి నా మనస్సులోని మాటను చెప్పటానికి వచ్చాను—మా వాళ్ల ఉద్దేశ్యం నేను మిమ్మల్ని తిరిగి వివాహం చేసుకోవాలని!—మీరు నన్నూ నా పరిస్థితులనూ చూచి జాలితోగాని, నా అందాన్ని చూచిగాని అంగీకరించవచ్చు— కాని, నాకు తిరిగి వివాహం చేసుకోవాలనే కోరిక లేదు —నేను వివాహం చేసుకోను — చెడకో, మంచికో ఒకసారి జరిగిపోయింది ఒకరితో నా జీవితం ముడిపడిపోయింది. నా దురదృష్టాన్ని దేవుడు చిన్నచూపు చూశాడు — కాని మరొకరు జాలితో మరోసారి నన్ను చిన్న చూపు చూడటం నేను సహించలేను. నేను భరించలేను—వివాహం చేసుకొని క్షణ క్షణం రగిలే గుండెల్ని అదిమిపట్టుకొని బ్రతకలేను నేను— క్షమించాలి! — నా మీద మీ రేమైనా ఆశల గూడు కట్టుకుంటుంటే అదిలోనే తుడిచివేసుకోండి— తరువాత బాధపడవద్దు మీరు—నన్నుబాధ పెట్టవద్దు—వస్తాను!'

గిరుక్కున—సీతాపతి కళ్లు చెదిరేలా—వెనుదిరిగింది.

రెండడుగులు వేసి ఆగి, 'ఈ మనుష్యుల కోరికల నెదిరించి ఎంతో ఉన్నతంగా జీవితం గడపాలనుకుంటున్నాను — శలవ్!' ఆమె చటుక్కున మాయమయింది.

అతడలాగే కుర్చీకంటుకుపోయి కూర్చున్నాడు—ఆ మాయమయిన విద్యుల్లత వంక జాలిగా, దీనంగా, పవిత్రంగా చూస్తూ●